126

# పేరడాక్స్

పునశ్చరణ చేసుకోదగ్గ సంస్కృతి ప్రతిజాతికీ ఎంతో కొంత వుండి తీరుతుంది. అది ప్రజల స్మృతి పొరల మధ్య కొంతకాలం దాక్కొని, ఆ తర్వాత మేధావుల మేధస్సులో దోబూచులాడి, పుస్తకాల రూపంలో; వాస్తవికత కొంతా, కల్పన కొంతా పడుగు పేకల్లా అల్లుకుని; చరిత్రగా అవతరించి ప్రజల ముందు నిల్చుంటుంది. ప్రజలు దాన్ని ఏ కథగానో, కలగానో అపోహ పడుతోన్న తరుణంలో - అలాంటి చరిత్రలున్న ఆ యా దేశాలూ మతలబులూ, వాటిని వారు పునరుజ్జీవింప చేసుకున్న కథలూ-కమామీషూ బయటికి వస్తాయి. దాన్ని అలంబనగా చేసుకుని తమ జాతి సంస్కృతినీ పునరుజ్జీవింప చేసుకోవాలనే ప్రయత్నం ప్రారంభమౌతుంది.

అలాంటి ప్రయత్నమే కార్యరూపం దాల్చి రాజధాని మహా నగరంలో ఒక గొప్ప సభ జరుగుతోంది. ఆ సభలో తరతరాల జాతి చరిత్రనీ, సంస్కృతినీ ప్రదర్శిస్తారుట! కవుల్నీ కళాకారుల్నీ సన్మానిస్తారుట!! ముఖ్యంగా చరిత్ర మరుగుకి జారుకుంటోన్న జానపద కళల్ని పునరుద్ధరిస్తారుట!! అందుకని ఆ కళారూపాల్ని సభలో ప్రదర్శింప చేసి దేశ విదేశాల్నుంచి వచ్చిన ప్రతినిధులకు చూపిస్తారుట. . . .

ఈ వార్త తెలిసి ఎగిరి గంతేశాడు రంగదాసు.

తన కంఠం. . . . తనకథ. . . ప్రపంచమంతా పాకిపోయే తరుణం ఆసన్నమైందని మహా సంబరపడిపోయేడు.

రంగదాసుని ఆ చుట్టుపక్కల గ్రామాల్లో అందరూ ఎరుగుదురు. అతను జముకు కొడుతూ, కంఠం విప్పి కథ పాడ్డం మొదలెట్టేడంటే ప్రేక్షకులు మైమరిచి పోతారన్నమాట!

ఒకసారి ఓ స్కూలు వార్షికోత్సవంలో రంగదాసు పాడటం జరిగింది. ఆ వుత్సవాలకి ముఖ్య అతిధిగా వచ్చిన జిల్లా కలెక్టరుగారు ఆ పాట విని ముగ్దుడై ఓ

బంగారు పతకాన్ని బహూకరించేడు. తనవల్ల ఏం సహాయం కావల్సి వచ్చినా తప్పక చేస్తానని అప్పుడే హామీ ఇచ్చేరు కలెక్టర్‌గారు. దాన్ని ఆసరాగా తీసుకుని వెళ్ళేడు రంగదాసు.

కలెక్టరుగారు చాలా సంతోషించేరు.

"జిల్లాలో, నీలాంటి కళాకారులెవరైనా వుంటే పంపించ వల్సిందని ప్రభుత్వంవారు రాశారు" అని చెప్పి రంగదాసుకు తప్పక అవకాశం ఇప్పించ వల్సిందిగా సిఫార్స్ చేశారు.

రంగదాసు జిల్లా పొలిమేరలు దాటి ఏనాడూ బయటికి పోలేదు. పోవాలనే సరదావున్నా అందుకు తగిన అవకాశం అతనికెప్పుడూ రాలేదు. నలుగురు పిల్లల్తో ప్రతిరోజు ఒక మహా గండంగా గడుస్తుంది.

ఇప్పుడు రాజధానికి పోవాలంటే యాభై రూపాయలైనా కావాలి.

-ముందు సర్దుబాటు చేసుకుంటే తర్వాత సభవారే ఇస్తారుట! వసతి, భోజనం, అన్నీ వారే చూసుకుంటారుట! దానికితోడు మంచి పారితోషికం కూడా ముడుతుంది.

-తన కంఠం, కథ, విని పెద్దలు, మంత్రులు ముగ్ధులైపోతారు. తనను మెచ్చుకుని పూలమాలలు వేసి, శాలువా కప్పి సన్మానిస్తారు. అబ్బ! నగరంలో సభ అంటే మాటలా? ఎంత మంది జనం వస్తారో లెక్కగట్టలేం. అంత మంది జనంలో పాడటం అంటే, ఎంత అదృష్టం వుండాలి? వెళ్లాలి. తప్పకుండా వెళ్లాలి! యీ సదవకాశాన్ని వినియోగించుకోవాలి. . . కాని . . .ఎలా? చేతిలో చిల్లిగవ్వైనా లేదే?

ఇంట్లో ఎక్కడెక్కడ ఏం సామానుందో జాగ్రత్తగా మననం చేసుకున్నాడు. ఏమీ కన్పించలా. కూతురి చెవుల్నున్న దుద్దులు మాత్రం మెరుపులా అతని కళ్ళముందు మెరిసేయి.

"అమ్మాయీ. . . " అని ముద్దుగా పిల్చేడు.

"ఎందుకు నాన్నా. . ." అంటూ ముందుకు వచ్చి నిలబడింది కూతురు.

ఆమె చెవుల్నివున్న దుద్దులు చూస్తే తను కాసిన గుర్రం ముందుగా పరుగెడుతున్నంత సంబరం కలిగింది రంగదాసుకు.

"నువు చిన్న సాయం చేయాలితల్లీ!"

"అదేవిటి నాన్నా! నా సాయం ఏవిటి?"

"అవును తల్లీ. నువు ఆ దుద్దులు ఇచ్చేవంటే మళ్ళీ వచ్చి మాంచి నెక్లెసు చేయించి పెడతా."

బతిమాలేడు కూతుర్ని.

"ఎప్పుడూ అలాగే చెబుతావు. చేయించినట్టే చేయించి మళ్ళీ అమ్మేసుకుంటావు."

దెప్పిందా పిల్ల.

-అవును, వున్నది ఒక్క ఆడపిల్ల. చేతిలోకి డబ్బు చిక్కినప్పుడల్లా ఏదో వస్తువు చేయించి పెడుతూనే వున్నాడు. కాని ఇబ్బంది వచ్చినప్పుడు అమ్మకతప్పటంలేదు. పేదరాలుగా పుట్టడం తన దౌర్భాగ్యం. తనకు పిల్లలుగా పుట్టడం వాళ్ళ కర్మ.

"చూడు తల్లీ. ఈసారిక అసలు అమ్మనే అమ్మను. ప్రభుత్వం మనకి బోలెడు పైకమిస్తుందమ్మా."

ఆ పసిదాన్ని బులిపించి ఆ దుద్దులుకాస్తా తీసేసుకున్నాడు. సభవారెలాగూ పైసలిస్తారు కాబట్టి తిరుగు ప్రయాణం గురించి ఆలోచించనక్కర్లేదు. వస్తువు అమ్మితే తిరిగి కొనటం కష్టం. అందుకని పాతిక రూపాయలకు వస్తువు తాకట్టుపెట్టి తన దగ్గరున్న కొంత పైకం జతచేసి పయనమయ్యాడు రంగదాసు.

స్టేషన్లో రైలు దిగగానే పెద్దకోలాహలం కన్పించింది. 'సంస్కృతీ సభల విచారణ కేంద్రం' అని బోర్డు కన్పిస్తే అక్కడికెళ్ళి కలెక్టరిచ్చిన కాగితం చూపించేడు.

"మాకు భోజనాలు, వసతి ఎక్కడ ఏర్పాటు చేస్తారో చెబుతారా?" అనడిగేడు.

"ముందు సభకి వెళ్ళండి. అక్కడ కార్యాలయంలో విచారిస్తే అంతా తెలుస్తుంది."

ఎలా వెళ్లాలో, ఏ బస్సు ఎక్కి ఎక్కడ దిగాలో అంతా చెప్పేడు అక క్కడున్న వ్యక్తి. నా నా యాతనా పడి అక్కడికి చేరుకున్నాడు రంగదాసు.

సంస్కృతీ సభల కార్యాలయం జాతరలావుంది. ఎవరు ఎవరికి ఏం చెబుతున్నారో అంతా అయోమయంగా వుంది. సమయం చిక్కేక తనకు కలెక్టరిచ్చిన కాగితం చూపించేడు.

"కార్యక్రమాల జాబితా నెలరోజుల క్రితమే తయారై పోయింది. ఇప్పుడేమీ అవకాశం చిక్కదు."

చెప్పేరు కౌంటర్లో.

"అంత దూరంనుంచి వస్తిని, పైగా కలెక్టరుగారు పంపిస్తిరి. అవకాశం లేదంటే ఎట్లా?"

అతను పకపకా నవ్వేడు.

"ఇక్కడ మంత్రుల మనుషులకే గాని కలెక్టర్ల మనుషులకు జాగాలేదు"

"పోనీ ఉండటానికి వసతి, కాస్త భోజనం. . . ."

"విదేశాలనుంచి వచ్చిన వాళ్ళకే గతిలేదు. మీ కెక్కడ? వెళ్ళు నాటైం వేస్ట్ చెయ్యకు" అని విసిరికొట్టేడా రిసెప్షనిస్టు.

సాయంత్రం నాలుగవుతోంది. జనం ప్రవాహంలా వచ్చి లోపలి కెళ్ళిపోతున్నారు. ఎక్కడ చూసినా పోలీసులే.

ఓ గేటు దగ్గరి కెళ్ళి లోపలికెళ్ళటానికి ప్రయత్నించాడు రంగదాసు. పాస్ అడిగేరు. బిక్కమొగం వేస్తే మెడ పట్టుకుగెంటేశారు.

ఇల్లు వదిల్నప్పట్నుంచీ తిండిలేదు. చేతిలో పైసల్లేవు. కుళాయి నీళ్ళతో కడుపు నింపుకున్నాడు.

నాలుగు రోజులు గడిచి పోయేయి.

అయిదో రోజు ప్రదర్శనకి జనం విపరీతంగా విరగబడుతున్నారు. సినిమావారి సంగీత కచేరీ అట! తొక్కిసలాట, లాఠీఛార్జి.!. ఒక్కటిగాదు. లోపలికెళ్లినంత మందీ బైట వుండిపోయారు.

రంగదాసుకు కడుపు మండుతోంది. ఇంటికి మరలే మాట ఎలావున్నా కడుపు నింపుకోవడానికైనా వీధిగాయకుడిగా మారక తప్పలేదు.

మెత్తని పట్టువస్త్రంతో కట్టిన జముకు బయటికి తీసేడు. శ్రావ్యమైన కంఠం విప్పి పాడటం ప్రారంభించేడు.

లోపల సంగీత కచేరీ మాంచి జోరుగా సాగుతోంది. పాశ్చాత్య వాద్య పరికరాలు ఝూమ్మని మోగుతోంటే మధ్య మధ్యలో నానాగాత్ర పరిమళం వీస్తోంది.

సభకి ఆలస్యంగా వచ్చిన ఒక విదేశీయుడు రంగదాసు పాటవిని అక్కడే ఆగిపోయాడు. అయిదు నిముషాల తర్వాత లోపలికెళ్లి టేపురికార్డర్లు పట్టుకుని విదేశీయుల నందర్నీ వెంటబెట్టుకుని బైటకొచ్చేడు.

రంగదాసు మైమరిచి పాడుతున్నాడు. కంఠం టేపు మీద హత్తుకుంటోంది. అరగంట తర్వాత మళ్ళీ హడావుడి, లోపలివాళ్ళంతా బైటికి-తొక్కిసలాట - లాఠీల మోత-తిట్లూ-కోలాహలం-

మంత్రిగారు హడావుడిగా బైటికొచ్చేరు. వారి వెనుక వున్నత పోలీసు అధికార్లు వరుస కట్టేరు. అసలుకథ తెలుసుకుని అక్కడి కొచ్చేప్పటికి కంఠం ఆగిపోయింది.

"ఎవడు వీడు. ఈడ్చి అవతల పడెయ్యండి" అన్నారు మంత్రిగారు.

ఆరుగురు జవాన్లు పరుగెత్తి కెళ్ళి రంగదాసును పట్టుకున్నారు. అతని చేతిలోని డప్పు జారిపోయింది. ఓ విదేశీయుడు డప్పుతీసి పవిత్రంగా పట్టుకున్నాడు.

అతన్ని అంబులెన్సు ఎక్కడికి మోసుకుపోయిందో తెలీదు.

*(పుస్తక ప్రపంచం, నవంబర్ 1978)*